గోపాలానికి ఏమిటోలాఅనిపించింది. అదే అన్నాడు

'తప్పు లేద్రోయ్ గోపాలం. ఎవరి పని వాళ్లు చేసుకోవడంలోసిగ్గుపడాల్సింది ఏమీలేదు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడ్డానికి ఎవరో ఏదో అనుకుంటారని నువ్వు బాధపడ్డం దేనికోయ్. చూసేవాళ్ళకు కొత్తగా వుంటుంది. ఎవరయినాఏదన్నా అంటే కమ్మగా ఓనవ్వు పారేయ్ వాళ్ళ మీద. అదే తరవాత అలవాటై పోతుంది. ఎంతకాలం వెక్కిరిస్తారోయ్ ఎవరైనా మటుకు. ఓపికుండద్దూ. నిన్ను చూసి ఇంతా కొంతమంది నీ అడుగుజాడల్లో నడిచినా ఆశ్చర్యముండదు.'

'కానీ మేస్టారు. చూస్తూ చూస్తూ...'

'చూస్తూ ఎవరూఏమీ చెయ్యలేరోయ్. అంతానువ్వనుకోవడంలో వుంది.'

'ఇంట్లో వాళ్లు ఒప్పుకోవాలి కదండీ'

'నువ్వు సిద్ధపడితే మిగతావి సమస్యలు కావోయ్'

'సిద్ధపడినా ముదుపు కావాలికదామేష్టారు'

'ఏంటోయ్. పందరూపాయల్తో కూడా ప్రారంభించొచ్చు. నువ్వు సరే అంటే నాకు తెలిసిన బ్యాంకు మేనేజరున్నాడు. అతనికి చెప్పి రెండు వేలిప్పిస్తాను. ఆలోచించుకో'

గోపాలం ఆ రోజు రాత్రంతా ఆలోచించాడు. ఎవరికాళ్ళ మీద వాళ్ళు నిలబడటానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదని ధృఢంగా నమ్మకం కలిగింది, గోపాలం నిశ్చయించుకున్నాడు. మర్నాడు తండ్రితో అన్నగార్లతో చర్చించాడు. అతన్ని పెద్దన్నయ్య ప్రోత్సహించాడు. తండ్రి అయిష్టంగానే ఒప్పుకున్నాడు వెంటనే రామ్మూర్తి మేష్టార్ని కలుసుకున్నాడు గోపాలం.

నెల రోజుల్లో ఆర్ట్సు కాలేజి ఎదురుగుండా టీ దుకాణం పెట్టాడు గోపాలం. రామ్మూర్తి మేస్టారు ఫస్ట్ కష్టమర్. ప్రిన్సిపాల్ అభినందించాడు. ఫ్రెండ్సంతా గురూ అప్పుడప్పుడు ఒక కప్పు ఫ్రీగా కొట్టిస్తూవుండు' అన్నారు.

గోపాలంలో మళ్ళీ హుషారు పుంజుకుంది.

గోపాలం టీ దుకాణం పెట్టి పదిరోజులయింది.

'గురూ ఒక టీ కొట్టు' అన్న మాటల్తో ఉలిక్కిపడి, నవ్వుతూ టీ అందించాడు గోపాలం.

* * *

---

కొడుకు : నాన్నా ! మనిషికి తోక వుంటుందా?
తండ్రి : ఉండదు.
కొడుకు : మరి మా టీచరు, నీకు పాఠం చెప్పాలంటే తల ప్రాణం తోకకి వస్తుంది అంటున్నారే? -కె. వి. లక్ష్మి



# త్రిశూలం

వీరపల్లి వీణావాణి

అది.... ఆకాశంలో చంద్రుడు ఆఖరి శ్వాసను పీల్చుకొంటున్న వేళ.

గడియారంలోని మూడు ముళ్ళు గమ్మత్తుగా కౌగిలించుకొనే వేళ. మనుషులందరూ సుషుప్తి స్మశానంలో కెళ్లి.... నిర్జీవ స్వప్న కపాలాలతో ఆడుకొనేవేళ. నిశ్శబ్దం తాండవించే ఆ అర్ధరాత్రివేళ.... కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఆ పాకలో....చీకట్లోకి చూపుల్ని పారేసి ఆలోచిస్తున్నాడు సింహాద్రి. అతని మనసులో అయిదారు గంటలనుండి సంఘర్షణ జరుగుతూనే ఉంది. తాను చేయబోయే పనిలోని మంచి చెడుల్ని బేరీజు వేసుకొంటున్నాడు.

అర్ధగంట గడిచిపోయింది.

ఆఖరిదమ్మును గట్టిగాలాగి బీడీముక్కను అవతల పారేశాడు సింహాద్రి. అతని పక్కగా.... పదహారేళ్ళ వయసుదాటిన అతని కూతురు దుర్గ....గాఢంగా నిద్రపోతోంది. ఆ చీకట్లో.... స్పష్టంగా కన్పించని దుర్గముఖంవేపు కడుపు తీపి నిండిన కన్నులతో ఒక్క క్షణంచూసి.. దృఢమైన నిర్ణయంతో కూర్చున్న చోటు నుండి పైకి లేచాడు సింహాద్రి.

ఆ గుడిసె ద్వారానికి అడ్డం పెట్టిన వెదురు తడికను తీసుకొని...మెల్లగా గుడిసె వెలుపలికి వచ్చి నిలబడి చుట్టూ కలయ చూశాడు. బయట అంతా చీకటి ఆకలి లాంటి చీకటి....అజ్ఞానం లాంటి చీకటి....కన్ను పొడుచుకొన్నా ఏమీ కానరాని కటిక చీకటి. విషాదంగా ముగిసిన రసజీవుల శ్వాసలాగా వీస్తోందిగాలి. బయట....కొట్టాంలో గాదిలోని గడ్డిని తినే పశువుల మెడలలోని గంటల శబ్దం వినిపిస్తోంది. ఎక్కడో ఓ గుడ్లగూబ ఉండి ఉండీ అరుస్తోంది.

ఏ యింట్లోనూ దీపపు కాంతిలేదు.

ఆ చీకట్లో మెల్లగా....చప్పుడుకాకుండా గంగమ్మగుడివేపు నడకను సాగించాడు సింహాద్రి. మనిషి ఉనికిని గమనించిన కొన్ని పక్షులు టప టపా రెక్కలుకొట్టుకొంటూ..ఎటో ఎగిరిపోయాయి. మెల్లగా గంగమ్మ గుడి దగ్గరకి చేరుకున్నాడు సింహాద్రి

గుడి తలుపులు తెరిచే ఉన్నాయి.

పేదవాడి ఆశలాగా....మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది గుడిలోని దీపం. గుడిలోపలికి అడుగు వేసేముందు.... తనను ఎవరైనా గమనిస్తున్నారేమోనని ఓ సారి చుట్టూ కలయ చూసి..గుడిలోపలికి అడుగులు వేశాడు సింహాద్రి.

ఆ గుడి బాగా పాడుబడిపోయింది.

ఆ గుడిలోపల నేలలోకి పాతి పెట్టిన త్రిశూలాలు చాలా ఉన్నాయి నిలవకుండా నేలమీద పడిపోయిన త్రిశూలాలను అక్కడే గోడకు ఆనించి పెట్టారు.

గంగమ్మ విగ్రహం ముందు నిలబడ్డాడు సింహాద్రి.

ఆ విగ్రహం ముఖం మీద సన్నగా దీపపు కాంతి పడుతోంది. నాలుగురోజుల క్రితం జరిగిన చిన్న జాతరలోగంగమ్మ విగ్రహానికి కట్టిన ఎర్రని కొత్త చీర

యింకా అలాగే ఉంది. మెల్లగా ఆ దేవీ విగ్రహంమీద చేయివేస్తూ.... ఒక్కసారి ఆ విగ్రహం ముఖం లోకి చూశాడు సింహాద్రి. ఒళ్ళు జలదరించింది సింహాద్రికి. ఒక్కసారిగా అతనిలో రక్తప్రసరణ ఆగి మళ్ళీ ప్రవహించినట్లయ్యింది. సింహాద్రి గుండెల్లోని ధైర్యపు కేంద్ర బిందువులో తీక్షణంగా ఉండే ఆ దేవీ విగ్రహం చూపులు చురుక్కుమంటూ గుచ్చుకున్నాయి, అయినా సింహాద్రి భయపడక వచ్చిన పని ముగించుకొని చరచరా గుడి లోంచి వెళ్ళిపోయాడు.

కానీ....సింహాద్రి చేసిందేమిటో రెండు కళ్ళు గమనించాయని అతనికి తెలియదు! తూర్పు ఆకాశంలో యింకా వెలుగురేఖలు ప్రాకనేలేదు.

కానీ...అప్పటికే జాతర సందర్భంగా గంగమ్మ విగ్రహానికి కట్టబడిన చీర దొంగలించబడిందనే వార్త పూజారి మాధవయ్య ద్వారా ఆ ఊరంతా ప్రాకిపోయింది. దేవాలయంలో దొంగతనమా? అంటూ ఆ ఊరి ఆడవాళ్ళు ముక్కుమీద వేలేసుకొన్నారు.


ఉదయం ఎనిమిది గంటలయ్యేసరికి... ఊరు ఊరంతా రచ్చబండ దగ్గరగుంపు చేరారు. ఆ చీరను ఎవరు దొంగలించారా అనేదే అందరి మనసుల్లో మెదిలేప్రశ్న. ఆ ప్రశ్నకు జవాబు ఆ ఊరి పెద్ద.... మోతుబరి రైతు అయిన ఒక్క బలరామయ్యకు మాత్రం తెలుసు... కానీ అది ఆయనకు తెలుసునని యింకెవరికీ ఆ ఊళ్ళో వాళ్ళకు తెలియదు. ఆ రచ్చబండమీద మధ్యలో మౌనంగా కూర్చున్నాడు బాలరామయ్య. "బలరామయ్య మావాఁ! ఆ గంగమ్మ గుడిని యాతరంలో కట్టినారో మనకు తెలవదు. ఆ గుళ్ళో యిట్లా దొంగతనం జరిగిందని మన పెద్దోళ్ళు యెప్పుడన్నా సెప్పంగా మనం యిన్నామా? లేదు. యెప్పుడూ యిట్లాంటి అన్నాయం ఈ ఊళ్ళో జరగలా. కానీ యిప్పుడు... మన అయాంలో ఈఅన్నాయం జరిగిపోయింది. ఆ దొంగతనం సేసిన యదవనాయాలెవుడో ఈ ఊళ్లో వాడే అయ్యుంటాడు. ఆడిని మనం ఊపిరితో యిసిపెట్ట కూడదు. మావాఁ" అన్నాడు కనకయ్య.

"కనకయ్య బావ సెప్పింది నిజమే. అట్లాంటోన్ని మనం నరికి ఆడి తలను గంగమ్మ మెడలో ఎయ్యాలి. యియ్యాల ఈ పనేసినోడు రేపు యింకో అన్యాయానికి ఒడిగడ్తాడు" బసవరాజు అన్నాడు.

"దొంగ సచ్చినోడిని పాణాలు తీశేసినా పాపం ఉండదు" అంటూ శాపాలు పెట్టింది రాజమ్మ.

ఇలా అందరూ తలాఓమాటంటున్నారు! అందరి మాటలను మౌనంగా వింటున్నాడు బలరామయ్య. ఆధునిక నాగరికత లేవీ ప్రాకని ఆ మారుమూలపల్లెకు బలరామయ్యే మకుటంలేని మహారాజు. ఆ ఊళ్ళో ఎవరూ పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకు వెళ్ళి ఎరుగరు. కారణం... ఆ ఊరికి న్యాయస్థానం ఆ రచ్చబండే. బలరామయ్యే అక్కడ న్యాయాధిపతి-మరణ దండన లాంటి శిక్షనైనా ఆయన వెయ్యవలసిందే.

ఆ ఊళ్ళో బలరామయ్య చెప్పింది వేదం. అతని మాటకు ఆ ఊళ్ళో ఎదురులేదు. ఏ కుర్రకుంకైనా ఎదురు తిరిగితే....



వాడికోపం... మరుసటి రోజు సాయం త్రానికల్లా స్మశానంలో తప్పక తగల బడి పోవలసిందే. పైసర్గాలలో ఆయనకు కావలసినంత పలుకుబడి ఉంది. ఆఊళ్ళో సగానికి పైగా ఆయన భూముంమీదే ఆధారపడి బ్రతుకుతున్నారు.

బలరామయ్య మహారసికుడు.

ఆ ఊళ్ళో నుండి ఏ ఆడపిల్లా బల రామయ్య బలమైన కౌగిలిలో నలిగిపోనిదే పరాయి ఊరికి కోడలుగా వెళ్ళదు.పరాయి ఊరినుండి ఆ ఊరికి కోడలుగా వచ్చిన ప్రతి ఆడపిల్లా వారం లోపల ఆయన కౌగిలిలో నలగకుండా మిగలదు. బల రామయ్య కౌగిలిలో నలగకుండా తప్పిం చుకొన గల్గింది ఒక్క సింహాద్రికూతురు దుర్గ మాత్రమే.

"అలా ఊరికే నింపాదిగా కూకుంటే ఎలా బావా! ఏం చేద్దామో సెప్పమరి" అంటూ శేషయ్య మౌనంగా కూర్చున్న బలరామయ్యను కుదిపాడు.

"సేసేదేముంది బావా! ఈ పన్జేసిన యద వెవుడో కనుక్కోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకే నేను సెప్తున్నా! అందరూ యినండి. ఇయ్యాలమంగళవారం. వొచ్చే మంగళ వారం లోపున యీ యదవ పన్జేసినోడెవుడో మర్యాదగా ఎవురికీ తెలీ కుండా ఆ సీరను గంగమ్మ యిగ్రహానికి కట్టేస్తే సరి. లేదా... నా యిసయం అందరికి తెలుసు. ఆడిని పట్టుకొని... ఆడికవాన్ని గంగమ్మ ముందు బెడ్తాను నాకు గంగమ్మకు నరబలి యిచ్చిన పుణ్యమైనా మిగులుద్ది" అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. బలరామయ్య. తర్వాత అందరూ వెళ్ళిపోయారు.

సాయంత్రం నాలుగు గంటలు దాటు తోంది.


గంగమ్మ గుడికి కొంచెం దక్షిణంగా ఉండే పొలం దగ్గర బావి గట్టుమీద ఒక పెద్ద షెడ్ ఉంది. ఆ పొలం ఆ బావి బల రామయ్యదే. ఆ షెడ్‌లో ఒక ప్రక్క ఆయిల్ యింజన్ అమర్చబడి ఉంది. ఇంకో ప్రక్క ఓ పెద్ద మంచం...దాని మీద మెత్తని బెడ్ ఉంది. ఆ షెడ్‌లో బలరామయ్య అప్పుడప్పుడూ విశ్రాంతి తీసుకొంటూ ఉంటాడు. ఒకో్కరాత్రి ఆ షెడ్‌లోనే పడుకొంటూ ఉంటాడు. తనకు కావలసిన ఆడవాళ్ళను రాత్రులలో ఆ షెడ్ దగ్గరికి రప్పించుకొంటూ ఉంటాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అది ఆయన కామకేళీ విలాసమందిరం.

బెడ్ మీద కూర్చొని తాపీగా చుట్ట కాలు స్తున్నాడు బలరామయ్య.

ఆయన కాళ్ళను గట్టిగా వాటేసుకొని... కన్నీళ్ళు పెట్టుకొన్నాడు సింహాద్రి.

"ఒరేయ్ సిమ్మాద్రీ! రాత్రి గంగమ్మ గుడిలో నువ్వు యెలగ బెట్టిన నిర్వాకం నా కళ్ళతో సొయంగా చూసినా... ఈ విషయం అందరికీ తెలిస్తే... ఏమవుద్దో తెలుసా? నిన్ను ముక్కలు ముక్కలుగా నరికేస్తారు" మెల్లగా అన్నాడు బల రామయ్య.

"అయ్యా! ఎప్పుడూ యిట్టా పాపం నేను సెయ్యలేదు. జాతరకని దుర్గను తీసుకొచ్చినా. దానికో మంచి సీరకూడా లేదు. పాత గుడ్డల్తో దాన్ని అల్లుడు కాడికి పంపించాలంటే నా మనసొప్ప లేదయ్యా. దానికో కొత్తసీర కొనిద్దామని డబ్బు కోసం ఊరంతా తిరిగినానయ్యా!




యాడా అప్పు దొరకలేదు. అందు కని..."

"అందుకని గుడిలో సీరను దొంగి లిస్తావా? సరే నీ పాణాల మీది కొచ్చిం దేమీలేదు. ముందు నా కాళ్ళు వొదిలిపెట్టు ఈ విషయం ఎక్కడా పొక్క నీకుండా నేను రహస్యంగానే దాస్తా. నిన్ను రక్షించే బాధ్యత నాది. కానీ... నువ్వు నాకో సిన్నపని చేసిపెట్టాల"

"సెప్పండయ్యా"

'రేపురాత్రికి... ఎన్నెల కుంకిపోయి నాక .. ఎవ్వరికీ తెలవకుండా ... నీ కూతురు దుర్గను... ఈ షెడ్‌లోకి రమ్మని సెప్పు" తాపీగా చెప్పాడు బల రామయ్య.

ఆ మాట వినగానే సింహాద్రి గుండెలలో డైనమేట్ పేలిపోయినట్లయ్యింది.

"అయ్యా! అన్నాయం" అంటూ మళ్ళీ కాళ్ళు పట్టుకొన్నాడు సింహాద్రి "ఒరేయ్ సిమ్మాద్రీ! నా యిసయం నీకు తెలుసు. నామాట కాదంటే...ఏం జరుగుద్దో నేను మళ్ళీ సెప్పాల్సిన పనిలేదు. రేపు ఉద యం నేను ఎల్లి సాయంత్రానికల్లా వొచ్చేస్తాను. వొచ్చేటప్పుడు దుర్గకో మంచి సీర తెస్తాను. గంగమ్మ గుడిలో నువ్వు ఎత్తుకపోయిన సీరను కట్టుకొని. రేపు రాత్రి దుర్గను యిక్కడికి రమ్మను. రేపు రాత్రి నేను యిక్కడే ఉంటాను. ఇంగో... దుర్గగానీ రాకపోయిందా... మీరు యిద్దరూ పాణాలతో ఉండరు మరిసిపోక మరి" అంటూ బలరామయ్య అక్కడి నుండి చరచరా వెళ్ళిపోయాడు.

సింహాద్రి నిశ్చేష్టుడై పోయాడు.

అక్కడికక్కడే తలను బండకు బాదు కొని చచ్చిపోదామన్పించింది సింహాద్రికి. బలరామయ్యకు ఎదురు తిరిగితే...జరగ బోయేది ఏమిటో తనకు తెలుసు. అసలు ఈ ఊరు రాకుండా ఉంటే ఎంతబాగుం డేదని పించింది సింహాద్రికి. నిజానికి సింహాద్రి వాళ్ళది ఆ ఊరు కాదు.

ఎక్కడి నుండో సంవత్సరం క్రితం ఆ ఊరికి కొత్తగా వచ్చారు. వచ్చిన ఆరు నెలలకు...అనుకోకుండా దుర్గకు సంబంధం కుదిరితే... పెళ్ళి చేసే శాడు సింహాద్రి. అతను రోజూ కూలి చేసుకొంటూ బ్రతికే వాడు. ఆడవాళ్ళను చెరిపేసే పరమ రాక్షసుడు బలరామయ్యని సిహాంద్రికి తెలుసు. కానీ ఆయన చూపు తన కూతురి మీద కూడా పడుతుందని ఎప్పుడూ అనుకోలేదు సింహాద్రి.

o o o

అర్ధరాత్రి దాటిపోయి చాలా సేపైంది.

బయటంతా గాఢాంధ కారం.

ఆ సమయంలో... బావిగట్టుమీద ఉంటే ఆ షెడ్‌లోని మంచంమీద నగ్నంగా బలరామయ్య... అతని ఉక్కు కౌగిలిలో సర్వస్వాన్ని పోగొట్టుకొని దుర్గ...

బలరామయ్య రక్తం బాగా చల్లబడిపోయింది. మెల్లగా మంచందిగి టార్చ్‌లైట్ వేసి తన బట్టలు అందుకొని కట్టుకొన్నాడు.

"ఇదిగో నీకోసం బస్తీనుండి తీసుకొచ్చాను ఈ సీర. దీన్నికట్టుకో. ఆ మంచం ప్రక్కన పడిఉండే ఆసీరను తీసి మడతపెట్టు" అంటూ తను బస్తీ నుండి తెచ్చినచీరను దుర్గకు అందించాడు బలరామయ్య.

దుర్గ ఆచీరను అందుకొని కట్టుకొంది. బలరామయ్య ఆరాటంతో చిరిగిన జాకెట్‌ను వేసుకొని... మంచం ప్రక్కన పడి ఉండే... ఆ ఎర్రచీరను తీసి మడతలు పెట్టింది.

"యికపద" అన్నాడు బలరామయ్య.

ఇద్దరూ షెడ్‌లోంచి బయటికొచ్చారు.

బలరామయ్య ముందు నడుస్తూ అప్పుడప్పుడూ టార్చిలైట్ వేస్తున్నాడు. దుర్గ అతని వెనుక నడుస్తోంది.

సాధారణంగా ఏతండ్రీ తన ప్రాణం కోసం తన కన్నకూతుర్ని యింకో మగాడి దగ్గర పడుకోబెట్టడానికి ప్రయత్నించడు. అలాగే... ఏ కూతురూ... చూస్తూ చూస్తూ కన్నతండ్రిని పోగొట్టుకోదు. ఆతండ్రి ప్రాణాల్ని నిలబెట్టేదుకోసం తన శీలాన్ని పోగొట్టుకోడానికి కూతురు తప్పకుండా సిద్ధపడుతుంది.

ఇప్పుడు దుర్గ అదే చేసింది

"అయ్యా! నాకు నీకంటే నామానం గొప్ప కాదు" అని చెప్పి... సింహాద్రి ఎంత వారించినా వినకుండా .. బలరామయ్యకు బలయి పోవడానికే సిద్ధ పడింది దుర్గ.

బలరామయ్య... గంగమ్మ గుడి దగ్గర ఆగాడు.

"దుర్గా! యిందాకా నువ్వు మడతలు పెట్టిన ఆసీర యిటివ్వు. అదిగంగమ్మది. మీఅయ్య తీసుకొచ్చేసినాడు. మళ్ళీ ఆ సీరను గంగమ్మ యిగ్రహానికెట్టాల" అంటూ దుర్గ చేతుల్లోంచి... మడతలు పెట్టిన చీరను లాక్కున్నాడు బలరామయ్య.

"నేను యిగ్రహానికి సీర కట్టిరావాలి. నువ్వు చప్పుడు కాకుండా గబగబా మీ యింటికి ఎల్లిపో" అని మెల్లగా అన్నాడు బలరామయ్య.

దుర్గ... గబగబా తనగుడిసెవేపు నడక సాగించింది.

బలరామయ్య గుడిలోపలికి మెల్లగా నడిచాడు.

గుడిలో దీపం ఎప్పుడో ఆరిపోయింది.

అంతా చీకటి. ఆచీకట్లో... టార్చ్‌లైట్ గంగమ్మ విగ్రహానికి ఫోకస్ చేస్తూంటే తన ఉనికిని ఎవరయినా తెలుసుకొంటారేమోనని... టార్చిలైట్‌ను క్రింద పెట్టేసి... చీకట్లోనే విగ్రహాన్ని తడిమాడు. తర్వాత తన చేతుల్లో ఉండే చీరను మడతలు పూర్తిగా విప్పేసి... ఆ విగ్రహానికి కట్టడానికై కొంచెం ముందుకు నడిచాడు బలరామయ్య.

విగ్రహం ముందునిలబడి... చీరను కట్టడానికి ఓ చేయి పైకెత్తాడు.

అంతే...

"అమ్మా!" అంటూ చావుకేకవేసి అలాగే ముందుకు వొరిగి గంగమ్మ విగ్రహం మీద పడ్డాడు బలరామయ్య.

బలరామయ్య చావుకేక... ఆఊరి నిద్ర మత్తును వదిలించింది.

ఆకేక విన్పించిన సమయంలో... దుర్గ తన గుడిసెలో... కట్టుకొన్న చీరను విప్పేసి పాతచీరను కట్టుకొంటోంది.

సరిగ్గా అప్పుడే సింహాద్రి... గుడిసెలో కుక్కిమంచంమీద బోర్లా పడి కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

ఆకేక విన్పించడంతో సింహాద్రి తక్షున లేచి కూర్చున్నాడు.

"అమ్మలూ! ఆకేక... బలరామయ్యది మల్లేలేదూ!"

"అవునయ్యా! నాకు అదే అనుమానంగా ఉంది" దుర్గ మెల్లగా అంది.

ఇంతలో ఊళ్లో కలకలం ప్రారంభమైంది. కొందరు లాంతర్లు వెలిగించుకొని...



మరి కొందరు టార్చిలైట్స్ వేసుకొని వీధిలోకి పరుగులుతో వచ్చారు.

"ఒరేయ్ ఆగొంతు నేను బాగాయిన్నాను. ఎద్దులకు గాడిలో గడ్డి ఏస్తుంటే ఆకేక నాకు యిన్పించింది. ఆ గొంతు... ఆ గొంతు... బలరామయ్య మాదిరి మల్లే ఉంది" అని కనకయ్య అన్నాడో లేదో కొందరు బలరామయ్య యింటికి పరుగెత్తారు. కానీ... ఆయన ఇంట్లోలేడని.. షెడ్‌లో పడుకోడానికి వెళ్ళాడని... ఆయన భార్య చెప్పడంతో... యిక అందరి అనుమానం.. మరి బంపటి కి. అడ్డదారిలో ఓ అయిదుమంది షెడ్‌దగ్గరకి పరుగెత్తి కెళ్ళి చూశారు.

కానీ... ఆ షెడ్ లాక్ చెయ్యబడి ఉంది. ఊళ్ళో కలకలం పెద్దదైంది. లాంతర్లు టార్చిలైట్లు తీసుకొని... ఊరు నలు మూలలా వెదకడం ప్రారంభించారు బలరామయ్య కోసం.

పూజారి మాధవయ్య లాంతరు పట్టుకొని నడుస్తున్నాడు.

అతనితోపాటు యింకా ఓ పదిమంది... అందరి చేతుల్లోనూ... టార్చిలైట్స్... గంగమ్మ గుడి చుట్టూ చూసి... గుడిలోకి అడుగు పెట్టిన మాధవయ్య కెవ్వుమన్నాడు.

అక్కడ గంగమ్మ విగ్రహం ముందు... రక్తపు మడుగులో బలరామయ్య శవం. ఆశవం వీపుమీద... బాగా లోతుకు చొచ్చుకుపోయిన త్రిశూలం. వెనుక దిగబడ్డ ఆత్రిశూలం కొనలు... గుండెల్లోకి బాగా దిగబడి పోయాయి.

బలరామయ్య శవంతోపాటు... ఆ రక్తపు మడుగులో... రెండ్రోజుల క్రితం అదే గుడిలోంచి దొంగిలించబడ్డ ఎర్రచీర... బాగా తెల్లవారి పోయింది. ఊళ్లోని జనమంతా అక్కడే ఉన్నారు. వాళ్ళలో దుర్గ, సింహాద్రి కూడా ఉన్నారు. వాళ్లు ఒకరి ముఖాలనొకరు చూసుకొన్నారు. ప్రతి ఒక్కరి ముఖంలోని పెద్ద ప్రశ్న. దాంతోపాటు ఆశ్చర్యం... ఆచీర బలరామయ్య చేతుల్లో ఉండడమేమిటని, జరిగిన దానికి కారణం ఎవరో ఎవరి ఆ చనాలలోకీ ఎవరిఊహల్లోకీ అందడం లేదు. బలరామయ్య భార్య... శవంపై పడి విలపిస్తోంది.

గంగమ్మ చూపులు... బలరామయ్య, శవం వేపు తీక్షణంగా... ఇంకానా నీ దారుణాలు యికసాగవు అన్నట్లుగా ఉన్నాయి.

పూజారి మాధవయ్య మనస్సు తృప్తిగా ఉంది. ఇన్నాళ్ళకు నేనోమంచిపని చెయ్యగలిగాను అని అనుకొన్నాడు. అంతకు ముందు ముందు రోజు... బలరామయ్య సింహాద్రి ఆ షెడ్‌లో మాట్లాడుకొన్న మాటలు... పూజారి మాధవయ్య వినకుండా ఉంటే... ఎవడినో గంగమ్మకు నరబలి యిస్తానన్న బలరామయ్య... యివాళ తనే ఆ నరబలి అయ్యేవాడు కాదు.

